Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 294 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 8 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# రైతు కుటుంబాలు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ

## - ఇథనాల్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యేలా ప్రోత్సాహం - 19వ ఎస్ఐపీబీ సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం - రూ.9,076 కోట్ల పెట్టుబడులు - 10,531 ఉద్యోగాలకు అవకాశం - సీఎం చంద్రబాబు అధ్యక్షతన 19వ ఎస్ఐపీబీ సమావేశం

**అమరావతి, (రాజధాని వార్తలు):** రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలని... ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే... మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకు రావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.



**100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం**

'పర్యాటక రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్ర వ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగిలాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది. ఏటికొప్పాక, కొండపల్లి, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలి.' అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే... ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా... దీనికి కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

**సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి**

రెన్యువబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు.

రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజర య్యారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్లలో ఇప్పటి వరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టు లకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ. 11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

19వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు:

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థ నెల్లూరు జిల్లాలో 4 స్టార్ హోటల్ – రూ.139.92 కోట్ల పెట్టుబడి, 180 మందికి ఉపాధి. 2. మాధవి లీజర్ అండ్ స్టేస్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో 3 స్టార్ హోటల్ – రూ.52.10 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉపాధి. 3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో సమగ్ర అమ్యూజ్‌మెంట్ పార్క్ – రూ.68.69 కోట్ల పెట్టుబడి, 690 మందికి ఉపాధి. 4. వజ్ర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ విజయవాడలో హోటల్, బ్యాంక్వెట్, ఎగ్జిబిషన్ సెంటర్ – రూ.62.40 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉపాధి. 5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ (ఎన్ఐఎల్‌పి) తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్నఎట్టిపాకంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ – రూ.255 కోట్ల పెట్టుబడి, 400 మందికి పైగా ఉపాధి. 6. అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనకాపల్లి జిల్లా పరవాడలో సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ – రూ.1,600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉపాధి. 7. బెర్రీ అలాయ్స్ లిమిటెడ్ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ మాంగనీస్ సిన్టర్, డీఆర్ఐ, కార్బన్ పేస్ట్ ప్లాంట్ – రూ.1,200 కోట్ల పెట్టుబడి, 831 మందికి ఉపాధి. 8. జియో మైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ – రూ.689 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉపాధి. 9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ అసెట్ IV ప్రైవేట్ లిమిటెడ్ (గూగుల్ వేర్ హౌస్ పార్టనర్స్) విశాఖ పట్నంలో లాజిస్టిక్స్, లైట్ ఇండస్ట్రియల్ పార్క్ – రూ.1,008 కోట్ల పెట్టుబడి, 5,000 మందికి ఉపాధి. 10. అదానీ ఫౌండేషన్ విశాఖపట్నం జిల్లా కపులుప్పాడలో ప్రాజెక్టు – రూ.2,200 కోట్ల పెట్టుబడి. 11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లా శ్రీ సిటీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ – రూ. 1,801 కోట్ల పెట్టుబడి, 80 మందికి ఉపాధి.

# సీఎం విజయ్‌కి మద్రాసు హైకోర్టు నోటీసులు

**ఇంటర్‌నెట్ డెస్క్:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఎన్నికల విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. క్రీడా శాఖ మంత్రి ఆదవ్ అర్జున సాధిం చిన విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ ఏకసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని హైకోర్టు పిటిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సాంకేతిక ప్రక్రియ పూర్తయిన తర్వాత సీఎం విజయ్, మంత్రి ఆదవ్ అర్జునకు 3 వారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనున్నారు. ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా.. ఆరు నెలలలోపే పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. కాగా, నామినేషన్ అఫిడవిట్‌లో పెండింగ్ కేసుల వివరాలు దాచారని, ఎన్నికల ఖర్చులను పూర్తిగా చూపలేదని విజయ్‌పై డీఎంకే అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్



ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో చట్ట విరుద్ధంగా చిన్నపిల్లలను ఉపయోగించుకున్నా రంటూ ఇనిగో తన పిటిషన్‌లో ప్రస్తావించారు. విజయ్ విజయాన్ని రద్దు చేసి తనను విజేతగా ప్రకటించాలని, అలాగే తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఉపఎన్నికపై స్టే విధించాలని డీఎంకే అభ్యర్థి ఇనిగో కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం


## - సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి



**అమరావతి, (రాజధాని వార్తలు):** జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, పెన్షన్, హైపవర్ కమిటీ, మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుతో పాటు ఇతర జర్నలిస్టుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి హామీ యిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ప్రతినిధివర్గం మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 4న విజయవాడలో జరిగిన జర్నలిస్టుల మహాప్రదర్శనలో మంత్రి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ పరిష్కరించిన హామీల విషయంలో కృతజ్ఞతలు తెలిపింది. మిగతా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసింది. దానిని శ్రద్ధగా చదివి నోట్ చేసుకున్న మంత్రి పార్థసారధి గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి అతిత్వరలోనే మీ డిమాండ్లను అమలు చేసేలా కృషి చేస్తానని అన్నారు. మంత్రిని కలిసిన ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జి.ఆంజనేయలు, ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు కలిమిశ్రీ, ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్యతరహా దిన పత్రికలు, పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు ఖాన్, స్టేట్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.డి. ఆనంద్ వున్నారు.

# సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం





**అమరావతి, (రాజధాని వార్తలు):** హాజరైన పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర శాఖల ఉన్నతాధికారులు. రెండో దశ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుపై చర్చ. మంత్రుల కమిటీ సిఫార్సుల మేరకు వివిధ సంస్థలకు రాజధానిలో భూ కేటాయింపులు తదితర అంశాలపై చర్చ.

...నారాయణ, మంత్రి

2024 జూన్ 12 నుంచి ల్యాండ్ పూలింగ్‌కి భూములు ఇస్తున్న రైతులకు కౌలు 40 వేలు ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూములిచ్చినప్పటి నుంచి 10 ఏళ్ల పాటు అమలు. ప్రతి ఏటా జరీబు భూమికి ఎకరాకు 5000,మెట్ట భూమికి ఎకరాకు 3000 పెంచేందుకు ఆమోదం. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోతున్న వారికి అద్దె కొరకు నెలకు 10,000 ఇచ్చేందుకు ఆమోదం.

కొత్తగా పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములిచ్చే రైతుల కుటుంబాలకి రుణ మాఫీ చేసేందుకు అథారిటీ నిర్ణయం. 06-01-2026 లోపు లోన్ తీసుకున్న వారికి అమలు చేసేలా నిర్ణయం. ఇనామ్ భూములకొరకు దేవాదాయ శాఖకు 159 కోట్లు చెల్లించేందుకు ఆమోదం. అమరా వతిలోని 25 టౌన్ షిప్‌లలో ఒక్కో టౌన్ షిప్‌లో తప్పనిసరిగా ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం చెప్పారు. ఈ రాత్రిలోగా సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్‌కు భూములివ్వని వారికి రేపు భూసేకరణ అమలు చేస్తాం. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ ఇచ్చిన 2.5 ఎకరాలకు సేకరణ అమలు చేస్తాం. సీడ్ యాక్సిస్ కోసం నోటిఫికేషన్లు ఇచ్చిన భూములకు మాత్రమే అక్విజిషన్ అమలు.

# జాయింట్ కలెక్టర్‌ను జిల్లా వక్ఫ్ అధికారిగా నియమించండి

## - ప్రభుత్వాన్ని కోరిన ఏపీ వక్ఫ్ బోర్డు - వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు జిల్లా స్థాయిలో పరిపాలన మరింత బలోపేతం కావాలి : ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్


**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల నివారణ, న్యాయపరమైన చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో వక్ఫ్ పరిపాలనను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) జిల్లా వక్ఫ్ అధికారిగా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి (డిఎండబ్ల్యూఓ) అదనపు జిల్లా వక్ఫ్ అధికారిగా వ్యవహరిస్తున్నారని, అయితే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జాయింట్ కలెక్టర్‌ను జిల్లా వక్ఫ్ అధికారిగా, జిల్లా రెవెన్యూ అధికారిని అదనపు జిల్లా వక్ఫ్ అధికారిగా నియమించేలా ప్రభుత్వ ఉత్తర్వుల్లో సవరణలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వక్ఫ్ బోర్డు ప్రతిపాదించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణలు, న్యాయ వివాదాలు, అక్రమ నిర్మాణాల సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్, మున్సిపల్ తదితర శాఖల మధ్య సమన్వయం పెరిగి వక్ఫ్ ఆస్తుల రక్షణ, ఆక్రమణల తొలగింపు, న్యాయపరమైన చర్యలు మరింత వేగవంతంగా అమలవుతాయని అన్నారు. ఈ మేరకు వక్ఫ్ బోర్డు తీర్మానం చేసి ప్రభుత్వానికి అధికారికంగా ప్రతిపాదనలు పంపిందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరలో నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఫరూక్ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఎంతగానో శ్రమిస్తున్నారని, సహకరిస్తున్నారని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను భావితరాలకు భద్రపరచడం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రధాన బాధ్యత అని, ఆ దిశగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల సమన్వయంతో మరింత సమర్థవంతంగా పని చేస్తామని అబ్దుల్ అజీజ్ తెలిపారు.



# భారతదేశపు మొట్టమొదటి ఏఐ-ఆధారిత పర్యాటక రాష్ట్రంగా ఏపీ : పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**- సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఎక్స్‌ప్లర్జర్ మధ్య మూడేళ్ల వ్యూహాత్మక అవగాహన ఒప్పందం - రాష్ట్ర వ్యాప్తంగా నివు ఏఐ విస్తరణ.. భారతదేశంలోనే తొలి 'ఏఐ పవర్డ్ టూరిజం' రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని మంత్రి దుర్గేష్ కీలక ప్రకటన - రాష్ట్రంలోని 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో 'నివు ఏఐ' సేవలు..ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం : మంత్రి కందుల దుర్గేష్**






**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొట్ట మొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పర్యాటక రాష్ట్రంగా తీర్చిది ద్దేందుకు పర్యాటక శాఖ చారిత్రాత్మక అడుగు వేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ప్రముఖ ట్రావెల్ సంస్థ 'ఎక్స్‌ప్లర్జర్' రూపొం దించిన 'నివు ఏఐ' ప్లాట్‌ఫారమ్ వినియోగానికి ఏపీ పర్యాటక అథారిటీ మూడేళ్ల వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పర్యా టక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీఏ ఎండీ అమ్రపాలి కాట, ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి మరియు ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో మంత్రి కందుల దుర్గేష్ సంబంధిత అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ కీలక ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని 100కు పైగా ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలలో పర్యాటకులకు బహుభాషా ఏఐ సహా యాన్ని అందించనుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పనితీరు బాగుంటే కాలపరిమితిని పొడిగించే అవకాశమున్నట్లు తెలిపారు. మొదటి ఏడాదిలో 30 ప్రధాన ప్రాంతాల్లో, మూడేళ్లలో పూర్తిస్థా యిలో అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం చేశారు. దీని వల్ల పర్యాటకులకు ఎలాంటి ఖర్చు లేదని, ఇది పూర్తిగా ఉచితమని, ఎలాంటి ప్రత్యేక యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటకుల ప్రాధాన్యతలు, భాషలు, ప్రవర్తనా సరళిని విశ్లేషించి భవిష్యత్తు ప్రణాళికలు రచించడానికి ఏపీటీఏకు రియల్-టైమ్ అనలిటిక్స్ లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఈ టెక్నాలజీ ఎలా పని చేస్తుందో లైవ్‌లో టెస్ట్ చేసి చూపించారు. ASK AI పేరుతో ఉన్న క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. మంత్రి దుర్గేష్, సెక్రటరీ అజయ్ జైన్ స్వయంగా ఏఐ టెక్నాలజీని వినియోగించి స్వయంగా సంభాషిం చారు. పర్యాటక ప్రాంతాల విశేషాలను మీడియా ప్రతినిధుల ఎదుట తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రకారం పర్యాటకులు రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని కోటలు, బీచ్‌లు, చారిత్రక కట్టడాలు మరియు దేవాలయాల వద్ద ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా 'నివు ఏఐ'తో నేరుగా సంభాషించవచ్చని వివరించారు. వాయిస్ లేదా టెక్స్ట్ రూపంలో 130కు పైగా భాషల్లో ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి మరియు ప్రాముఖ్య తను పర్యాటకులు తెలుసుకోవచ్చన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రవ్యా ప్తంగా విస్తరించడానికి ముందు.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన మంగళ గిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలలో పైలట్ ప్రాజెక్ట్‌ను విజయవం తంగా నిర్వహించామన్నారు. ప్రతిరోజూ వందలాది మంది భక్తులు ఈ ఏఐ సేవలను ఉపయోగించుకుంటూ, తమకు నచ్చిన భాషల్లో ఆలయ విశిష్టతను, పూజా విధానాలను తెలుసుకుని అద్భుతమైన స్పందన అందించారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలోని 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్య సాధనలో ఇదొక కీలక మైలురాయిగా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. స్థానిక తెలుగు భక్తుల నుండి అంతర్జాతీయ పర్యాటకుల వరకు ప్రతి ఒక్కరికీ మన సంస్కృతి, వారసత్వాన్ని వారి సొంత భాషలోనే వివరించే అద్భుతమైన సాంకేతికత ఇది అని, తానే స్వయంగా ఈ 'నివు ఏఐ'ని తెలుగులో పరీక్షించానని, ఇది ఎంతో ఖచ్చి తత్వంతో, గౌరవపూర్వకంగా సమాధానాలు ఇస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు.. గోదావరి పుష్కరాల్లో ఇది ఎక్కువగా భక్తులకు ఉపయోగపడనుందని తెలిపారు.రెండేళ్ల కాలంలో ఏపీ పర్యాటక రంగంలో తెచ్చిన వినూత్న సంస్కరణలు, టెక్నాలజీకి పెద్దపీట వేయడం మెచ్చి పలువురు ముందుకొస్తున్నారన్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ, ఈ సాంకేతికత ద్వారా ఆంధ్రప్రదేశ్ టూరిజం సరికొత్త పుంతలు తొక్కడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ టెక్నాలజీ సామా న్యుడికి, పర్యాటకుడికి సైతం అర్థమయ్యేలా ఉందన్నారు. ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి మాట్లాడుతూ.. "ఈ భాగస్వామ్యం రెండు అద్భుతమైన రంగాలను ఒకచోటకు చేరుస్తుందని, అం దులో ఒకటి ఆంధ్రప్రదేశ్ వారసత్వపు లోతు కాగా రెండవది ప్రపంచ స్థాయి భారతీయ సాంకేతికత అన్నారు. రాబోయే మూడేళ్లలో, ప్రతి సందర్శకుడు ఈ రాష్ట్రాన్ని సందర్శించే అనుభ వాన్ని పూర్తిగా మార్చనున్నామన్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని ఒక అపూర్వమైన ప్రక్రియగా కొనియాడారు.టెక్నాలజీ కి ఏపీ పెద్దపీట వేస్తుందని.. వీరిని పీఎం కార్యాలయం వారు సెలెక్ట్ చేసారని తెలిపారు. ప్రముఖ సినీనటుడు, సామాజిక సేవకర్త సోనూసూద్ ఎక్స్ ప్లర్జర్ కంపెనీలో భాగస్వామి, వాటా దారుగా ఉన్నారని పేర్కొన్నారు. ఎక్స్‌ప్లర్జర్ వ్యవస్థాపకుడు & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జితిన్ భాటియా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం తమకు దక్కిన గౌరవం అన్నారు. భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ప్రతి ప్రధాన పర్యాటక ప్రాంతం ప్రతి సందర్శకుడితో, ప్రతి భాషలో మాట్లాడే మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవబోతోందని స్పష్టం చేశారు. తమపై నమ్మకం ఉంచినందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీఏ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. "ఆంధ్రప్రదేశ్ వారసత్వం, చరిత్ర, ఆధ్యాత్మిక సంప్రదా యాలపై 'నివు ఏఐ' కి శిక్షణ ఇవ్వడానికి మా బృందాలు రాత్రిం బగళ్లు శ్రమిస్తున్నాయి. మంగళగిరిలోని రెండు మహాక్షేత్రాలలో జరిగిన పైలట్ ప్రాజెక్ట్‌లో, ప్రతిరోజూ వందలాది మంది భక్తులు ఇప్పటికే నివు ఏఐతో మాట్లాడుతున్నారు. గౌరవంతో, శ్రద్ధతో రూపొందించిన ఈ సాంకేతికత సందర్శకులు ఆ ప్రదేశంతో కనెక్ట్ అయ్యే విధానాన్ని ఎంతగానో మెరుగుపరుస్తుందని ఇది మాకు నిరూపించింది. రాష్ట్రంలోని ప్రతి పర్యాటక ప్రాంతం లోనూ ఇదే విధమైన లోతైన అనుభవాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము." అన్నారు. ప్రస్తుతం 75 దేశాలలో 22 మిలియన్లకు పైగా ఉన్న వినియోగదారులున్నారని, +20 సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తమ ప్లాట్‌ఫారమ్‌ను ప్రదర్శించడానికి ఎంపిక చేసారని తెలిపారు.

# అర్హులందరికీ పక్కా గృహాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయిం పులు చేయడంతో పాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శ్రాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఏపి సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19 మధ్య మొత్తం 13,04,516 ఇళ్లు మంజూరు చేస్తే 10వేల 194 కోట్ల రూ.లు ఖర్చు చేసి 8,04,853 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అందరికి ఇళ్లు అందించా లన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారని గుర్తుచేశారు.అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీ, బీసీలు ఇళ్ల నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50 వేల చొప్పున, ఆదివాసి గిరిజనులకు ఇంటికి రూ.75 వేల చొప్పున అందించి వారికి చేయుత నివ్వడం జరిగిం దని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. గత ప్రభుత్వం పాలనలో పరిశీలిస్తే 18లక్షల 61 వేల గృహాలు మంజూరు చేయగా ఆ ప్రభుత్వ పాలన పూర్తయ్యే నాటికి అనగా 2024 మే 31 నాటికి 9వేల 588 కోట్ల రూ.లు ఖర్చు చేసి కేవలం 6లక్షల 70వేల 636 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారని మంత్రి పార్థ సారధి పేర్కొన్నారు. అన్నింటికన్నా అన్యాయం చంద్రబాబు ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై అయి స్వంత నిధులతో ఇంటి నిర్మాణాలు చేపట్టిన 4లక్షల 36 వేల 907 మంది లబ్ధిదారుల ఇళ్లను నిర్ధాక్ష్యణ్యంగా రద్దు చేసిన గత ప్రభుత్వం పేద లబబ్ధిదారులకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల పంపిణీకి సంబం ధించి గత ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 1.50 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు వంతున మహిళా లబ్ధిదారుల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల 29వేల 450 ఇంటి స్థలాలు పంపిణీ చేయగా వాటిలో 7లక్షల 89 వేల 550 మందికి గృహాలు మంజూరు చేయగా ఇంకా 12 లక్షల 39 వేల 900 ఖాళీ స్థలాల్లో ఇళ్లు మంజూరు చేయాల్సి ఉందని మంత్రి పార్థసారధి తెలిపారు. 2024 తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసిందని మంత్రి పార్థసారధి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కేంద్రానికి పంపించి మంజూరు చేయిం చుకోవడం జరిగిందని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకంలో భాగంగా 57,600 గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా 684 ఇళ్లు, పీఎం-జనమన్ క్రింద 28,430 ఇళ్లు మొత్తం 86,714 ఇళ్లు మం జూరయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పిఎంఏవై అర్బన్, గ్రామీణ మరియు పియం జన్ మన్ పథకాల కింద 2 వేల 102 కోట్ల రూ.లు ఖర్చు చేసి 4 లక్షల 56 వేల 536 ఇళ్ళను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. పక్కా గృహాల నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రభుత్వం దరఖాస్తులు కోరగా దాదాపు 10,42,199 దరఖాస్తులు అందాయన్నారు.స్క్రూటినీ అనంతరం నిబంధనల మేరకు 9.50 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిం దన్నారు. వీటిలో మొదటి విడతగా కేంద్రం 74,812 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.భవిష్యత్తులో అర్హుల సంఖ్యను బట్టి కేంద్రం నుండి పెద్ద సంఖ్యలో ఇళ్లను మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు. పీఎంఏవై అర్బన్ 2.0 పథకానికి యూనిట్ ధర రూ. 2.50 లక్షలుగా నిర్ధారించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇందులో రూ.1.50 లక్షలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష అందించనున్నాయన్నారు. అంతేకాకుండా అవసర మైతే ఎస్ హెచ్ జి గ్రూప్‌లో సభ్యులైన లబ్ధిదారులు బ్యాంకుల నుండి ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. అలాగే అదనంగా స్వచ్ఛభారత్ మిషన్ నుండి మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించడానికి గృహ నిర్మాణ శాఖ కసరత్తు చేస్తుం దన్నారు. అర్బన్ హౌసింగ్ పథకంలో ఇప్పటి వరకు 5801 ఇళ్లు పూర్తి చేయడంతో పాటు రూ.178.95 కోట్లు ఖర్చు చేశామన్నారు.పీఎంఏవై గ్రామీణ పథకంలో భాగంగా యూనిట్ ధర రూ. 2.39 లక్షలుగా నిర్ధారించడం జరిగిందన్నారు. ఇందులో రూ. 72 వేలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రూ.48 వేలు అంది స్తున్నాయన్నారు. అంతేకాకుండా రూ.80 వేలు వడ్డీ లేని రుణాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే ఎన్ఆర్ ఈజీఎస్ క్రింద రూ.39 వేలు అందిస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామం, వార్డుల్లో పనిచేసే 370 మంది ఇంజనీరింగ్ అసిస్టెం ట్లను ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు మంత్రి పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పాటు వివిధ కార్పొరేష న్లలో పని చేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 యేళ్ళకు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348 మంది వరకు విధుల్లో కొనసాగే అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం అవుతాయని చెప్పారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంమత్రి పార్థసారథి తెలిపారు. ఇప్పటికే బుట్టాయిగూడెం, తాడువాయి తదితర ప్రాంతాల్లో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పునరావసంలో భాగంగా పోలవరం పూర్తయ్యేలోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# 14న ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**- ఇళ్ల స్థలాలు... పెన్షన్లు అజెండాగా తీర్మానాలు - ప్రభుత్వం దృష్టికి పెండింగ్ సమస్యలు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 14న విజయవాడలో నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ ఏజె) గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. మంగళవారం ఇక్కడ అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద ఒక ప్రయివేట్ హోటల్‌లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించాల్సిన పలు అంశాలపై నిర్ణ యాలు తీసుకోవడం జరిగిందని గంట్ల శ్రీనుబాబు, నారాయణలు వివరించారు. ప్రధానంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ప్రభుత్వానికి పలు సందర్భాల్లో వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండే ళ్లు పూర్తి కావచ్చిన తరుణంలో మరోసారి ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పెన్షన్ విధానం ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని ..వర్కింగ్ జర్నలిస్ట లకు ఎంతో బాసటగా ఉండే ప్రమాధ భీమాను తిరిగి పునరుద్ధరిం చాలని కూడా కోరడం జరుగుతుందన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ప్రధాన సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అలాగే ఆయా అంశాలపై 14న విజయవాడ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలోనూ చర్చించి అవసరమైన మేరకు తీర్మాణాలు చేస్తామన్నారు. ఇంకా ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహాసభలు, రాష్ట్ర సమావేశాలపై కూడా ఆ సమావేశంలో తుదినిర్ణయం తీసుకోవడం జరుగుతుం దన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సభ్యత్వనమోదు కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. త్వరలో జాతీయ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను జిల్లాల వారీగా నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మధన్, స్మాల్ అండ్ మీడియం విశాఖ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్ పితాని సూర్యప్రసాద్ ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్ ఎన్ రామకృష్ణ, గొడబ రాంబాబు జాయింట్ సెక్రెటరీ పి.రవి శంకర్ ఉపాధ్యక్షులు. కిషోర్ నగేష్.బాబు, రాజశేఖర్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బర ప్రసాద్, ట్రెజరర్ కెవి శర్మ, కార్యవర్గ సభ్యులు అరుణ్ భాస్కర్ (హరి), తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏల అభివృద్ధి పనుల నిధుల వినియోగం వేగవంతం చేయాలి : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి





**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ మరియు శిశు సంక్షమ శాఖ మంత్రి గుమ్మిడి సం ధ్యారాణి అమరావతి సచివాలయంలో 3వ బ్లాక్‌లో గిరిజన ఇంజనీరింగ్ విభాగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.
PM JANMAN, DA GUGA, ఆర్టికల్-275, MNRGES మరియు ాాూాజ× పథకాల కింద మంజూరైన నిధులు, వాటి వ్యయం, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఐటిడిఏల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులను సమీ క్షిస్తూ నిధుల వినియోగం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఐటిడిఏల వారీగా అభివృద్ధి పనులకు అరకు - రూ.257 కోట్లు, సీతంపేట - రూ.163 కోట్లు, పార్వతీపురం - రూ.154 కోట్లు, పాడేరు - రూ.134 కోట్లు, రంపచోడవరం - రూ.112 కోట్లు, శ్రీశైలం - రూ.44 కోట్లు, చింతూరు - రూ.34 కోట్లు, నెల్లూరు - రూ.19 కోట్లు కేటాయించగా, మొత్తం రూ.1,049 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి, నాణ్యతతో పనులను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పురోగతి నివేదికలు సమర్పించాలని సూచించారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్య ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

## - నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను హెచ్చరించారు. సోమవా రం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, సర్వే ల్యాండ్ రికార్డుల డిడి నాగ శేఖర్, డిప్యూటీ కలెక్టర్లు కేశవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై నిరంతర అవగాహన కల్పించాలి : ఆర్.బి.ఎస్.కె పిఓ డా.జగన్ మోహన్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య సూత్రాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. ఎం.జె.పి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను వైద్య సిబ్బందితో కలిసి సోమవారం సందర్శించారు. తొలుత సిక్ రిజిస్టర్‌లో విద్యార్థుల ఆరోగ్య సమస్యల నమోదు ప్రక్రియ, చికిత్సా, పర్యవేక్షణ వివరాలపై పరిశీలించి హాస్టల్ హెల్త్ స్టాఫ్‌కు తగు సూచనలు చేశారు. హెల్త్ కార్డుల నమోదుపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. సాధారణ వ్యాదులు, ఆరోగ్య సూత్రాలను తెలియజేసే గోడ పత్రికలను పాఠశాల ఆవరణలో ఉండాలన్నారు. రుతుక్రమ ప్రక్రియ వివరాలకు సంబంధించిన రెడ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ప్రతీ నెలా తేదీలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు సాదారణ వ్యాధులపై, ఆరోగ్య అంశాలపై వారికున్న పరిజ్ఞానాన్ని పరీక్షించారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కామెర్లు, రక్తహీనత, క్షయ వ్యాదుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వర్షాలు నేపథ్యంలో త్రాగునీరు పరిశుభ్రతపై ప్రతీ రోజూ గమనించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. తదుపరి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పుష్ప, పాఠశాల ఇంచార్జి కె. అరుణ కుమారి, హాస్టల్ హెల్త్ స్టాఫ్ సి.హెచ్ గౌతమి, ఏఎన్ఎం ఎన్. శాంతి, ఆశా తదితరులు ఉన్నారు.

# జంతువుల నుంచి వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం - ఘనంగా జూనోసిస్ డే కార్యక్రమం





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జంతువుల నుంచి మానవులకు 200 నుంచి 250 వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు, పెంపుడు జంతువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని లయన్స్ పాస్ట్ జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్‌లు అన్నారు. సామర్లకోట ప్రభుత్వ పశు వైద్యశాలలో లయన్స్ క్లబ్ శ్రీ భీమేశ్వర ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేసే కార్యక్ర మాన్ని జోనోసిస్ డే సందర్భంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ ఫాస్ట్ గవర్నర్‌లు బాదం బాలకృష్ణ, ఈతల ఈశ్వర్ కుమారులు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేబిస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్య అతిథి బాదం బాలకృష్ణ అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సామర్లకోట లయన్స్ క్లబ్ సహకారంతో ఈ "జూనో సిస్ డే" కార్యక్రమాలు విజయవంతంగా చేపడుతున్నట్టు చెప్పారు.

ఈ సందర్భంగా లయన్స్ నాయకులు సింగవరపు సత్యనారాయణను ముఖ్య అతిథులు ఘనంగా సత్క రించి అభినందించారు. అలాగే క్లబ్ కార్యవర్గాన్ని వారు అభినందించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేసే శిబిరాన్ని ముఖ్య అతిథులు బాదం బాలకృష్ణ, పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డా. ఒకసారి ప్రారంభించారు. అనంతరం వందలాది జంతువులకుబ యాంటీ రాబిస్ టీకాలను పశు వైద్యులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డా. ప్రమీల, డా.శ్రావ్య, డా.కిరణ్మయి, లయన్స్ నాయకులు చిత్తలూరి వీర్రాజు (రాజా), బడుగు సీతారామరాజు, ఏలేటి రమేష్, కర్రి ఆది నారాయణ రెడ్డి, మేకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర అన్నదాన పథకానికి విరాళం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమారరామ భీమేశ్వరాలయ అన్నదాన పథకానికి సామర్లకోటకు చెందిన శ్రీ భీమేశ్వర హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్లు రూ. 25 వేలు విరాళం అందజేశారు. భీమేశ్వరాలయంలో ఈ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి బళ్ళ నీలకంఠంకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు స్వామివారిని అమ్మవారిని దర్శించుకోగా వారికి ఆలయ అధికారి అర్చకులు స్వామివారి చిత్రపటం అందించి, పండిత ఆశీర్వచనం, ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉదయగిరి అభివృద్ధికి పరిశ్రమలే బలమైన పునాది : మంత్రి నారాయణ

## - రెండేళ్లలో రూ.1,098.79 కోట్లతో అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలకు 1,086,87 కోట్లు కేటాయించాం - పరిశ్రమలతో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాము - కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



**ఉదయగిరి, (రాజధాని వార్తలు):** ఉదయగిరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గత రెండేళ్లలో ఉదయగిరి సంక్షేమం కోసం రూ.1,098.79 కోట్లు కేటాయించామని, ఇప్పటికే నాలుగు పరిశ్రమలకు ఆమోదం లభించగా వాటి ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సోమవారం ఉదయగిరికి చేరుకున్న మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, యువనేత నారా లోకేష్ కృషితో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రప్పించగలిగామని పేర్కొన్నారు. ఉదయగిరి ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని విమర్శించిన మంత్రి, టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని తిరిగి గాడిలో పెడుతోందన్నారు. గతంలో మూసివేసిన అన్నా కాంటీన్లను తిరిగి ప్రారంభించి రోజుకు 2.25 లక్షల మంది పేదలకు భోజనం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 2014లో రూ.38 వేల కోట్లతో ప్రారంభించిన 7 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని గత ప్రభుత్వం 2.5 లక్షల ఇళ్లకే పరిమితం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి కొనియాడారు. తాను కూడా "నారాయణ నేత్రజ్యోతి" కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ రాకతో ఉదయగిరి అభివృద్ధికి మరింత వేగం వస్తుందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఉదయగిరి రూపురేఖలు మారిపోతాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ కృషితో పరిశ్రమలు ప్రారంభం కానున్నాయని, ఉదయగిరి-సీతారాంపురం మండలాలకు తాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కలిగిరి-సంగం రోడ్డు పనులు ప్రారంభించడం, దుత్తలూరు-కావలి రోడ్డు సమస్య పరిష్కారం, నందవరం-ఉదయగిరి రోడ్డుకు నిధుల కేటాయింపు, బనగానపల్లి రోడ్డుకు అటవీ శాఖ అనుమతుల సమస్య పరిష్కారం, ఉదయగిరిలో మరో అన్నా కాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతమ్మ, టీడీపీ నేతలు చెంచల బాబు యాదవ్, చిరంజీవి రెడ్డి, బాబు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల జనాభా అరికట్టేందుకు యాంటీ బర్త్ కంట్రోల్ విభాగం ఏర్పాటు

## - ఆగస్టు నెలలో సేవలు ప్రారంభం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల పరిధిలో కుక్కల జనాభాను (సంతానోత్పత్తిని) తగ్గించేందుకు పశు వైద్యశాలలో "యాంటీ బర్త్ కంట్రోల్" ఆపరేషన్ థియేటర్ విభాగాన్ని, కుక్కల సంరక్షణకు ప్రత్యేక షెడ్డు రూ. 15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు వెల్లడించారు. స్థానిక పశు వైద్యశాల వద్ద ప్రారంభిస్తున్న పనులను సోమవారం కమిషనర్ పర్యవేక్షణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో కుక్కల సంతతిని తగ్గించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుక్కల యాంటీ భర్త్ కంట్రోల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దానిలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి సామర్లకోటలో ఒక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయడం ద్వారా కుక్కల జనాభా నియంత్రణ ఆపరేషన్లు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దానికి గాని అన్ని ఏర్పాట్లు ఉండే విధంగా ఈ యూనిట్ను తయారు చేస్తున్నట్టు చెప్పారు. ఆపరేషన్ అనంతరం ఐదు రోజులపాటు కుక్కలను పశువైద్యుల పర్యవేక్షణలో ఉంచేందుకు వీలుగా 50 కెనల్స్‌ను నిర్మించి వాటికి ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నట్లు చెప్పారు. 25 రోజులలోపు ఈ పనులు పూర్తి చేసి ఆగస్టు ఒకటి, రెండు తేదీల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా ఈ సేవలను ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. సామర్లకోటతో పాటు పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కుక్కలకు కూడా స్థానికంగానే ఆపరేషన్లు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

**పెంపుడు కుక్కలకు ప్రత్యేక ట్యాగ్‌లు :**

పెంపుడు కుక్కల గుర్తింపునకు పశుసంవర్ధక శాఖ అందించే ప్రత్యేక ట్యాగ్‌లను కుక్కల యజమానులు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు. పెంపుడు కుక్కల విషయంలో వాటిని జాగ్రత్తగా కాపాడుకునే బాధ్యత యజమానులు పైనే ఉంటుందన్నారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులను సంప్రదించి వారి కుక్కలకు చెవికి గాని, తోకకు గాని ఈ ట్యాగ్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీధి కుక్కలను పట్టుకునే సమయాల్లో పెంపుడు కుక్కలకు రక్షణ ఉండే విధంగా ఈ ట్యాగ్ ఉపయోగపడుతుందన్నారు. అయితే పెంపుడు కుక్కల యజమానులు వారి జంతువులను వీధుల్లో వదలకుండా, వీధి కుక్కల బారిన పడి గాయపడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

# పుష్కరాలకు ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేయాలి

## - ఆర్టీసీ డిపోను పరిశీలించి అధికారులతో సమీక్షించిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రానున్న పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ తగిన ఏర్పాటు చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఆర్టీసీ అధికారులను కోరారు. అమలాపురం ఆర్టీసీ డిపోను ఎంపీ హరీష్ బాలయోగి సోమవారం సందర్శించి పరిశీలించారు. అమలాపురం బస్ స్టేషన్ ఆధునీకరణతో పాటు పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలు సంబంధించి-2027 ప్రణాళికపై ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ) జి.సత్యనారాయణ, డిపో మేనేజర్ డివిఎల్ ఎన్ శర్మ, ఏఈ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఐశ్వర్యం నీడలో అప్పుల బతుకులు!

సంపద పోగుపడుతోంది, సామాన్యుల సంక్షేమం సన్నగిల్లుతోంది! వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం శాతాలు మొదలైన స్థూల ఆర్థిక సూచికలు భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా, పురోగమన పథంలో ఉన్నదని మనకు విదితం చేస్తాయి. సగటు కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించండి. స్థూల ఆర్థిక సూచికలు ఆవిష్కరిస్తున్న దృశ్యానికి భిన్నమైన వాస్తవ చిత్రం మనకు కనపడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏమంత శ్రేయోదాయకంగా లేదు. సంపద సృష్టికర్తలైన అత్యధిక ప్రజలకు నిజమైన సంక్షేమం లభించడం లేదు. గత పన్నెండు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న సంపద, వ్యక్తిగత కొనుగోలు శక్తి-ఒక వ్యక్తి తన ఆదాయంతో సమకూర్చుకోగల సరుకులు, సేవలు- మధ్య అతి ముఖ్యమైన లంకె తెగిపోయింది. అనేక వృత్తులు, ఉద్యోగాలలో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసినవి) పెరగలేదు. అసంఖ్యాక శ్రామిక కుటుంబాలు తమ జీవన వ్యయాలకు రుణాలు తీసుకోవల్సిన అగత్యంలో ఉన్నాయి. ఇదొక నిష్ఠుర నిజం. క్రెడిట్ కార్డు రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంతకంటే ముఖ్యంగా పదే పదే ఆ రుణాలు తీసుకోవడమూ పెరుగుతోంది. బంగారు ఆభరణాలు మొదలైన స్త్రీ ధనాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడమూ విరివిగా జరుగుతోంది. స్తంభించిన వేతనాలు, పెరుగుతున్న వినియోగ వ్యయాలకు మధ్య అంతరాన్ని పూడ్చుకునేందుకు రుణాలు చేయడం తప్పనిసరి అయిపోయింది. వర్తమాన జీవన వాస్తవమిది. మన సమాజంలో ఇప్పుడు వేతన--రుణ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నది ఆ కఠోర వాస్తవం స్పష్టం చేస్తోంది. వేతనాలు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. అప్పులు చేయడం అనివార్యమవుతోంది. విశేషమేమిటంటే అవి సులభంగా లభిస్తున్నాయి. వాటిని తీర్చడమే సమస్యవుతోంది. వేతన ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడమే అందుకు కారణం. తత్ఫలితంగా శ్రామిక శ్రేణులు అపాయకరమైన ఆర్థిక దుస్థితిలోకి జారిపోతున్నాయి. భారతీయ కార్మికుల ఆర్థిక ఇక్కట్లకు ధరల పెరుగుదలను కారణంగా చూపడం సమంజసం కాదు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ధరలు పెరిగిన మాట నిజమే. అయితే మనుగడకు రుణాలు తీసుకోవల్సిన అగత్యమేర్పడడానికి కారణం అది మాత్రమే కాదు. జాతి సంపద సృష్టి అవుతున్న, పంపిణీ జరుగుతున్న తీరుతెన్నులే ఆ అసంగత పరిస్థితికి కారణాలని చెప్పి తీరాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా పురోగమిస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు సదా ఊర్ధ్వ దిశలో ఉంటున్నాయి. అయితే పెరుగుతున్న జాతి సంపద, దానిని సృష్టించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రామిక శ్రేణులకు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ అవుతుందా? లేదు అనేదే కచ్చితమైన సమాధానం. వేతన అంతరాలు సుదీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం స్థూల ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వేతనాలు బెత్తెడుగా ఉండిపోవడం, వ్యయాలు బారెడు కావడం వల్లే భారతీయ కుటుంబాల నికర పొదుపు మొత్తాలు రికార్డు స్థాయిలో తగ్గిపోతున్నాయి. స్థూల జాతీయ వినియోగ ఆదాయం (జీఎన్‌డీఐ)లో 7 నుంచి 8శాతంగా ఉండే ఈ పొదుపు మొత్తాలు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5.2 శాతానికి తగ్గిపోయాయి. అయితే స్థిర, చరాస్తులు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలు 2014లో 3శాతం నుంచి 2023లో 5.7శాతానికి పెరిగాయి. ఫలితంగా చెల్లించవలసిన అప్పుల మొత్తాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కోవిడ్ ఉపద్రవంలో కుదేలయిన దేశ ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత బాగా కోలుకున్నదనడంలో సందేహం లేదు. అయితే ఈ ఆర్థిక పునరుద్ధరణ వేతనాల నైష్పత్తిక పెరుగుదల వల్ల కాకుండా కార్పొరేట్ లాభాల పెరుగుదల వల్లే అన్నది ఒక చేదు సత్యం. 2014-25 సంవత్సరాల మధ్య అనియత కార్మికుల వాస్తవ వేతనాల వార్షిక పెరుగుదల రేటు 1.5 శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ వేతన అణచివేతకు తోడు పట్టణ ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడడంతో శ్రామిక శ్రేణుల జీవన పరిస్థితులు మరింత అధ్వానమయ్యాయి. పైగా 2018-19 సంవత్సరం నుంచి తిరోగమన వలసలు (ఉద్యోగాలు హరించుకుపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చినవారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోవడం) పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యవసాయేతర రంగాల నుంచి వ్యవసాయరంగ ఉపాధులకు లక్షలాది శ్రామికులు తిరిగి వెళ్లిపోతున్నారు. వేతనాల పెరుగుదలకు ప్రత్యామ్నాయంగా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి అదెంతవరకు ఉపకరిస్తుంది? సమాధానం స్పష్టమే. వేతనాలు పెరగకపోయినా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికమవడంతో వినియోగదారు రుణాల స్వభావం మౌలికంగా మారిపోయింది. కుటుంబ రుణాలు ఇతోధికంగా పెరిగిపోవడం కంటే శ్రామిక ప్రజలు తమ జీవన వ్యయాల కోసం గణనీయంగా ఆ రుణాలపై ఆధారపడుతున్న పరిస్థితే బాగా కలవరపరుస్తోంది. ఇది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ అత్యవసర రుణాలు దేశ ప్రగతికి ఆటంకమవుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయంగా భారతీయ కుటుంబాలు తమకు డబ్బు అవసరమయినప్పుడు గృహాలు, పొలాలు, బంగారం మొదలైన వాటిని తనఖా పెట్టడం పరిపాటి. దీనివల్ల వారి తక్షణావసరాలు తీరడంతో పాటు స్థిర, చరాస్తుల రూపంలో భద్ర భవిష్యత్తును సమకూర్చుకునేందుకు కూడా దోహదం జరిగేది. మనుగడ కోసమే రుణాలు తీసుకోవలసిరావడం పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది.

# జ్ఞానాపురంలో దివంగత నొడగల ఆనందరావుకి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నివాళి





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జ్ఞానాపురం గ్రామానికి చెందిన ప్రముఖులు నొడగల రాజేష్ తండ్రి, దివంగత నొడగల ఆనందరావు సోమవారం తెల్లవారుజామున స్వర్గస్తులైన విషయం తెలిసి, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వారి నివాసానికి చేరుకుని ఆనందరావు పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివంగత ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. టీడీపీలో ఆనందరావు అందించిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేసుకుంటూ, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొని దివంగత ఆనందరావుకి తమ నివాళులు అర్పించారు.

# భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరం : డీఎస్పీ





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విద్యార్థులు భద్రతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం డిఎస్పీ ఎబిజీ తిలక్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం ప్రగతి పాఠశాల, జూనియర్ కళాశాలల్లో నేర రహిత సమాజం కోసం సైబర్, డ్రగ్స్ వద్దు బ్రో, కోప్టా యాక్ట్, యాంటీ ర్యాగింగ్ అంశాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిలక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సేఫ్ స్కూల్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఎటువంటి పొగాకు, పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం ఉన్నట్టు చెప్పారు. విద్యాసంస్థకు 100 గజాల దూరం లోపు ఎటువంటి పొగాకు, పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం, ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

**గుడ్ సమారిటన్ ప్రైజ్ మనీ అవార్డు :**

ఈ పథకం కింద ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లోపు వైద్య సహాయం అందించడంలో సహాయపడిన వారికి రూ. 25 వేల రూపాయల బహుమతి, ప్రశంసా పత్రానికి అర్హులన్నారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత అనగా ఉచితంగా చికిత్స పీఎం – రహత్ పథకం క్రింద రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రమాదం జరిగిన తేదీ నుండి ఏడు రోజుల వరకు అందించడం జరుగుతుందన్నారు. దేశంలోని అన్ని రకాల రోడ్డు ప్రమాదాలకు ఇది వర్తిస్తుందన్నారు. దీనికోసం 112 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చెయ్యాలన్నారు. అలాగే హిట్ మరియు రన్ ప్రమాద కేసులలో పరిహారం రూ. 2 లక్షలు (మరణించిన కేసులలో), తీవ్రంగా గాయపడిన కేసుల్లో రూ. 50 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

ఇంకా హెల్మెట్ ధరించండి – రోడ్డు ప్రమాదాల మరణాలను నివారించండి, త్రాగి వాహనాలను నడపవద్దు, సెల్‌ఫోన్ డ్రైవ్ వద్దు, ద్విచక్ర వాహనాలపై ఇద్దరు కంటే ఎక్కువ ఎక్కరాదని, ఇంట్లో ఎవరూ లేనప్పుడు పగలైనా, రాత్రి అయినా ఎటువంటి విలువైన ఆభరణాలు, వస్తువులు, నగదు ఉంచరాదని డిఎస్పీ సూచించారు. ఒంటరి మహిళలే టార్గెట్గా చైన్ స్నాచర్లు ఉంటారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బస్సులలోను, ఆటోల లోను ప్రయాణించేటప్పుడు తోటి ప్రయాణికులులాగా ప్రయాణిస్తూ బ్యాగ్‌లలో పెట్టిన విలువైన ఆభరణాలు, నగదును దొంగిలించే మహిళా దొంగలు ఉంటారని వివరించారు. ఇంకా "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో తాము ముందుకెళుతున్నందున గ్రామంలో ఎక్కడ పెడలర్స్, భూజర్స్ యొక్క మూమెంట్ ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. అలాగే ఏపీ పోలీస్ శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని మహిళలు, పిల్లల భద్రతకు రక్షణ పొందాలాన్నారు. బాల్య వివాహాలు సైబర్ మోసాలు, నేరాలకు గురి కావద్దని, డిజిటల్ అరెస్ట్ చట్టంలో లేనేలేదని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చేయవద్దని డిఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కళాశాల చైర్మన్ ఎన్ పూర్ణచంద్రరావు, ఏవో సిహెచ్ రామసత్యనారాయణ రావు, ఎంవీ సురేష్, పెద్దాపురం ఎస్సై యు పాపారావు, సిఐ వైఆర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడి మండలంలో భారీగా గంజాయి పట్టివేత

## - రూ. 28.87 లక్షల సొత్తు స్వాధీనం






**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామ శివారులోని ఎన్ హెచ్ 16 జాతీయ రహదారిపై ఒక ట్రాక్టర్లో గంజాయి తరలిస్తున్న కృష్ణాజిల్లా గన్నవరం మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి ఫ్రాన్సిస్ (57)ను పోలీసుల అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అతని నుండి రూ. 26.35 లక్షలు విలువ చేసే 52.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దీనిపై పెద్దాపురం డిఎస్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశంలో డీఎస్పీ ఏబీసీ తిలక్ వివరాలు వెల్లడించారు. కిర్లంపూడి పోలీసులకు వచ్చిన సమాచారం ప్రకారం వారు ఈగల్ టీం సంయుక్తంగా ఒక గెజిటెడ్ అధికారి సమక్షంలో బూరుగుపూడి వద్ద ఎన్ హెచ్ 16 రహదారిపై గంజాయితో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ చెప్పారు.

నిందితుడు శంఖవరం పరిసర ప్రాం తాల నుంచి గంజాయిని సేకరించి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. నిందితుడి వివరాల ప్రకారం దీని వెనకున్న నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాడు చెప్పారు. జగ్గంపేట సిఐబి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై జి సతీష్ ఆధ్వర్యంలో జగ్గంపేట పోలీసులు ఈ కవి తరలింపుపై ప్రత్యేకంగా పెట్టినట్టు తెలిపారు. కాగా గంజాయిని తరలిస్తున్న వాహనంతో పాటు, నిందు తరువాత ఉన్న సెల్ ఫోన్, 25 ప్యాకెట్లుగా కలిగిన 52.7 కిలోల గంజాయి వెరసి రూ. 28,87,250 విలువగల సొత్తులు నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్పీ వివరించారు. ఈ మేరకు అతడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా నిందితుని కిర్లం పూడి పోలీస్ స్టేషన్కు తరలించినట్టు డీఎస్పీ చెప్పారు. ఈ సమా వేశంలో సీఐ తిరుపతి రాజు, ఎస్సై సతీష్, ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## - కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన విదసం ఐక్యవేదిక




**అమలాపురం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దళితులకు ఇచ్చిన ఎన్నిక హామీలు అమలు చేయాలని, రద్దు అయిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో 20కి పైగా ఎస్సీ సంక్షేమ పథకాలు రద్దు అయ్యాయని 2024 ఎన్నికలలో టీడీపీ మానిఫెస్టోలో రద్దయిన ఎస్సీ, ఎస్టీ పథకాలు పునరుద్ధరిస్తామని, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్లు అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కూటమి సర్కారు అధికారాన్ని చేపట్టి రెండేళ్లు పూర్తయిందని ఈ రెండేళ్లలో ఎస్సీలకు మీరిచ్చిన ఎన్నికల హామీలు ఒక్కటి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# పాఠశాల చిన్నారులకు టేబుల్, కుర్చీలు బహుకరణ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంకలోని రాణేలంకమొల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ గోడిలంక, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం టేబుల్ మరియు కుర్చీలను బహుకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మా ముగ్గురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని మీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్నందుకు సంతోషంగా ఉందని మీరంతా కష్టపడి చదువుకుని మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలని తద్వారా పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు, గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ అధ్యక్షులు రమేష్ రాజు మాట్లాడుతూ చిన్నారులు ఆహ్లాదకరంగా కూర్చుని నోట్స్, హోంవర్క్ రాసుకోవడానికి తాము సమకూర్చిన టేబుల్, కుర్చీలు ఉపకరిస్తాయని అన్నారు. ఈ రెండు ట్రస్టులు పలుచోట్ల చేస్తున్న విద్య వైద్య సేవలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశంసిస్తూ అభినందించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.హిమ బిందు, ట్రస్ట్ అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, మోసుగంటి.వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ కె.పరమేశ్వరి, గ్రామ పెద్దలు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.వి.వి. సత్యనారాయణరాజు, జి.శ్రీలక్ష్మీ, కె.రామలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి గోడిలో ఘనంగా నిర్వహించారు. అల్లవరం మండలం గోడిలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ శాసన మం డలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరంలో విశేష సేవలు అందించడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయ మని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మి ప్రసాద్, సవరపు యేసు, బొమ్మి నాగేంద్రబాబు, బొమ్మి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి కోట్ల టార్గెట్ వైపు జైలర్-2



సినిమా రిలీజ్ కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ట్రేడ్ వర్గాల్లో ఇప్పటికే భారీ డిస్కషన్‌కు కారణమవుతున్న ప్రాజెక్ట్‌గా జైలర్-2 నిలుస్తోంది. మొదటి భాగం సాధించిన కమర్షియల్ సక్సెస్ తో పాటు, సీక్వెల్‌పై ఏర్పడిన అంచనాలు ఇప్పుడు ప్రీ రిలీజ్ బిజినెస్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నాయనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమవుతోంది. రిలీజ్‌కు ముందే డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం వివిధ ఏరియాల నుంచి ఇంట్రెస్ట్ పెరగడం ఈ సినిమాపై ఉన్న మార్కెట్ నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ప్రత్యేకంగా కేరళ మార్కెట్‌లో జైలర్-2కు అనూహ్యమైన డిమాండ్ కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం అక్కడ బెస్ట్ కలెక్షన్లు నమోదు చేయడంతో, జైలర్ రైట్స్‌ను సొంతం చేసుకోవడానికి ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు పోటీ పడుతున్నట్లు సమాచారం. అడ్వాన్స్ డీల్స్ విషయంలోనూ భారీ ఆఫర్లు వినిపిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇది సినిమా రిలీజ్‌కు ముందే రికార్డు స్థాయి బిజినెస్‌కు సంకేతంగా భావిస్తున్నారు. దీనికి మరో ప్రధాన కారణంగా మల్టీస్టారర్ ఎట్రాక్షన్‌ను ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మోహన్‌లాల్ ప్రభావం కేరళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. ఆయనకు ఉన్న అభిమాన వర్గం, రజినీకాంత్‌కు ఉన్న విశాలమైన మార్కెట్ కలిసి ఈ సినిమాను సౌత్‌లో అత్యంత క్రేజ్ ఉన్న ప్రాజెక్టుల లిస్టులో నిలబెడుతున్నాయి. రీసెంట్‌గా రిలీజైన రిలీజ్ డేట్ గ్లింప్స్ కూడా సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో గ్లింప్స్‌కు వచ్చిన రెస్పాన్స్, ఫ్యాన్స్ డిస్కషన్స్, ట్రేడ్ వర్గాల్లో పెరిగిన ఆసక్తి కలిసి జైలర్-2పై అంచనాలను మరింత బలపరిచాయి. సినిమా కంటెంట్‌కు సంబంధించిన వివరాలు పూర్తిగా బయటకు రాకముందే ఈ రేంజ్ బజ్ రావడం విశేషంగా చెప్పబడుతోంది. తెలుగు మార్కెట్‌లోనూ పరిస్థితి ఇదే విధంగా కనిపిస్తోంది. జైలర్‌కు లభించిన ఆదరణ కారణంగా రెండో భాగం థియేట్రికల్ రైట్స్‌పై కూడా మంచి ఆసక్తి నెలకొనే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మార్కెట్లలో ఒకేసారి స్ట్రాంగ్ బిజినెస్‌ను టార్గెట్‌గా పెట్టుకుని రిలీజ్ ప్లాన్స్ రూపొందుతున్నాయనే చర్చ సాగుతోంది. డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్, సూపర్ స్టార్ రజినీకాంత్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కావడం కూడా ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన బలంగా మారింది. తొలి భాగంలో మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించిన ఈ జోడీపై డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గట్టి నమ్మకం ఉంచుతున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రీ రిలీజ్ దశలోనే సినిమా బిజినెస్ ఊహించిన దానికంటే వేగంగా ముందుకు సాగుతోందని ట్రేడ్ వర్గాల అంచనా. ఇప్పటికే ఇండస్ట్రీలో వినిపిస్తున్న డిస్కషన్స్ ప్రకారం, జైలర్-2 కేవలం సీక్వెల్ మాత్రమే కాదు, పాన్ సౌత్ స్థాయిలో భారీ కమర్షియల్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. రిలీజ్‌కు ముందే కనిపిస్తున్న మార్కెట్ రెస్పాన్స్ చూస్తే, తొలి భాగం నెలకొల్పిన రికార్డులను అధిగమించే దిశగా ఈ సినిమా అడుగులేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జోరు కంటిన్యూ అయితే రూ. 1000 కోట్ల క్లబ్‌ను టార్గెట్‌గా పెట్టుకున్న సినిమాల్లో జైలర్-2 కూడా ఒకటిగా నిలిచే అవకాశాలను ట్రేడ్ వర్గాలు కొట్టిపారేయడం లేదు.

# వెంకీ చేరికతో టెన్షన్ ఫ్రీ..!



సంక్రాంతికి అనిల్ రావిపూడి తన సినిమాతో రావడం ఇప్పటికే కన్ఫర్మ్ అయింది. సంక్రాంతికి వస్తున్నాం, మన శంకరవర ప్రసాద్ గారు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సంక్రాంతి విజేతగా నిలిచిన అనిల్ రావిపూడి మరో సంక్రాంతి హిట్ కొట్టాలని పట్టుదలతో ఉన్నాడు. ఇప్పటికే వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో అనిల్ రావిపూడి మూవీని ప్రారంభించాడు. కొన్ని రోజుల క్రితం విభిన్నమైన పబ్లిసిటీతో అనిల్ రావిపూడి మూవీ ప్రారంభం అయిందని అందరికీ తెలిసేలా చేశాడు. తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం తనవైపు తిరిగి చూసే విధంగా ఓపెనింగ్ కోసం ప్రమోషన్ వీడియో చేసిన ఘనత అనిల్ రావిపూడికి దక్కింది అనడంలో సందేహం లేదు. సినిమా సంక్రాంతి 2027 కి రావాలి అంటే కచ్చితంగా మూడు నెలల్లో షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అనిల్ కచ్చితంగా సినిమాను పూర్తి చేస్తాడని అంత నమ్మకంగా ఉన్నారు.

**అనిల్ రావిపూడి దర్శకత్వంలో సంక్రాంతి మూవీ...**

అనిల్‌కి డేట్లు సరిగ్గా ఇస్తే తప్పకుండా అనుకున్న సమయంకు సినిమాను పూర్తి చేస్తాడని చాలా సార్లు నిరూపితం అయ్యింది. కానీ ఈ సినిమా మల్టీస్టారర్ కావడంతో పాటు, వెంకటేష్ ఈ సినిమా మాత్రమే కాకుండా మరో సినిమాను చేస్తూ ఉండటంతో ఏం జరుగుతుందా అనే టెన్షన్ మొదలైంది. రెండు వారాల క్రితమే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయిన విషయం తెల్సిందే. మొదటి షెడ్యూల్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ మాత్రమే పాల్గొనడంలో వెంకటేష్ రాక గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. వెంకటేష్ మరోవైపు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా షెడ్యూల్ కంటిన్యూ అవుతున్నాయి. అదే సమయంలో అనిల్ మూవీలోనూ వెంకటేష్ నటించాల్సి వస్తుంది. దాంతో రెండు సినిమాలకు గాను వెంకటేష్ డేట్లు క్లాష్ అయ్యే ప్రమాదం ఉందని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

**వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా...**

డేట్లు ఇబ్బంది అయితే అనిల్ రావిపూడి సినిమాను పూర్తి చేయడం కష్టం అవుతుందనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. కానీ అసలు విషయం ఏంటంటే అనిల్ రావిపూడి అన్ని ముందస్తుగానే ప్లాన్ చేసుకున్నాడు. వెంకటేష్ మరో సినిమా షూట్‌లో ఉన్నాడనే కళ్యాణ్ రామ్‌పై సోలో సీన్స్ తీయడం జరిగింది. ఇప్పుడు వెంకటేష్ షూటింగ్‌లో జాయిన్ కావడంతో కాంబో సీన్స్ షూటింగ్ చేస్తున్నాడు. కీర్తి సురేష్ సైతం బిజీగా ఉన్న కారణంగా ఆమెతోనూ కీలక సన్నివేశాల చిత్రీకరణ చేస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో పాటు ఇద్దరు హీరోయిన్స్ కీర్తి సురేష్, కృతి శెట్టిలు పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో చాలా కీలకమైన కాంబో సీన్స్ షూటింగ్ పూర్తి చేస్తారు. కాంబో సీన్స్ షూటింగ్ పూర్తి చేస్తే ఎవరికి వీలు ఉన్నప్పుడు వారివి సోలో సీన్స్ షూటింగ్ పెట్టుకోవచ్చు అని దర్శకుడు అనిల్ రావిపూడి ప్లాన్ చేశాడని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

**కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా...**

వెంకటేష్ మొదటి షెడ్యూల్‌లో జాయిన్ కాకపోవడంతో అభిమానులు ముఖ్యంగా అనిల్ రావిపూడి సినిమాలను ఇష్టపడే వారు ఆందోళన చెందారు. ఎట్టకేలకు వెంకీ షూటింగ్‌లో జాయిన్ అయినట్లుగా అధికారికంగా ప్రకటన రావడంతో అంతా టెన్షన్ ఫ్రీ అయ్యారు. అనిల్ రావిపూడి మరోసారి తన సినిమాను సంక్రాంతికి తీసుకు రావడం ఖాయం అనే నమ్మకంను వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాంతో వెంకటేష్‌కి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన అనిల్ రావిపూడి, కళ్యాణ్ రామ్‌తోనూ పటాస్ రూపొందించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు.

తనకు హిట్ ఇచ్చిన వారితో మరోసారి హిట్ సినిమాను చేసేందుకు అనిల్ రావిపూడి ఫుల్ గా ప్రిపేర్ అయ్యాడు. గత చిత్రాలకు ఏమాత్రం తగ్గకుండా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను అనిల్ రూపొందిస్తు న్నాడు. ఈ సినిమాలో వెంకటేష్, కళ్యాణ్‌రామ్‌లు బావ బామర్థి పాత్రల్లో కనిపించబోతున్నారని తెలుస్తోంది. అతి త్వర లోనే టైటిల్‌ను రివీల్ చేస్తానంటూ ఆ మధ్య అనిల్ రావిపూడి సన్నిహితుల వద్ద చెప్పాడట.

# నా కొడుకు చూసి గర్వపడే మూవీ ఇదే : కాజల్



టాలీవుడ్‌లో సుదీర్ఘ కాలం పాటు స్టార్ హీరోయిన్‌గా వెలుగు వెలిగిన కాజల్ అగర్వాల్ ఇప్పుడు కాస్త జోరు తగ్గిందని చెప్పక తప్పదు. సాధారణంగా పెళ్లి తర్వాత సౌత్ ఇండియన్ ఫిల్మ్ యాక్టర్స్ సినిమాలకు దూరంగా ఉంటారు. కానీ కాజల్ అగర్వాల్ మాత్రం సినిమాల్లో కంటిన్యూ అవుతూనే ఉంది. పెళ్లి తర్వాత చాలా సినిమాలను చేసిన కాజల్ అగర్వాల్ ప్రస్తుతం 'రామాయణం' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రణబీర్ కపూర్ ఈ సినిమాలో రాముడి పాత్రలో కనిపించబోతుండగా, సాయి పల్లవిని సీత పాత్రలో చూడబోతున్నాం. ఇక కన్నడ రాక్ స్టార్ యశ్‌ను ఇప్పటికే రావణ్ పాత్రకు ఎంపిక చేయడం, పలు సీన్స్‌ను షూట్ చేయడం కూడా జరిగింది. సినిమాలో అత్యంత కీలకమైన రావణ్ భార్య మండోదరి పాత్రకు గాను కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటికే మండోదరిగా కాజల్ నటించేసింది.

**కాజల్ అగర్వాల్ తనయుడు నీల్ కిచ్లు...**

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ రామాయణం సినిమా గురించి స్పందించింది. భవిష్యత్తులో నా కొడుకు నీల్ కిచ్లు 'రామాయణం'లోని నా పాత్రను చూస్తే తప్పకుండా గర్విస్తాడు. అలాంటి పాత్రను చేయడం చాలా సంతోషంగా ఉంది. నా కొడుకును దృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రస్తుతం సినిమాలను కమిట్ అవుతున్నట్లుగా కాజల్ పేర్కొంది. ప్రస్తుతం నీల్ కిచ్లు చిన్న పిల్లాడే అయినప్పటికీ అతడికి సినిమాల గురించి అవగాహన ఉందని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా నీల్‌కి రామాయణం అంటే చాలా ఇష్టం. అందులోని పలు పాత్రల గురించి పదే పదే మాట్లాడుతూ ఉంటాడని కాజల్ చెప్పుకొచ్చింది. రామాయణం కథను ఎంతో ఆసక్తిగా నీల్ కిచ్లు వింటాడని, అలాగే టీవీలోనూ చూస్తాడని, అలాంటి రామాయణం సినిమాలో నేను నటించడం వల్ల నీల్ కిచ్లు కచ్చితంగా గర్విస్తాడని, చాలా సంతోషిస్తాడని కాజల్ అంది.

**రామాయణంలో కాజల్ పాత్ర...**


నా కొడుకు పెద్దయ్యాక నా సినిమాలు చూసి మా అమ్మ చాలా మంచి పాత్రలు చేసింది, గొప్ప సినిమాల్లో భాగస్వామి అయిందని గర్వించాలని కోరుకుంటున్నాను. అందుకు తగ్గట్లుగానే కథల ఎంపిక, సినిమాలను ఎంపిక చేసుకుంటున్నట్లుగా కాజల్ పేర్కొంది. ప్రతి రోజు మా ఇంట్లో ఏదో ఒక సమయంలో రామ్‌లీలా జరుగుతుందని, రామాయణం గురించి ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉంటామని కాజల్ అంది. అందుకే భవిష్యత్తులో నా కొడుకు నేను మండోదరిగా నటించినందుకు తప్పకుండా సంతోషిస్తాడంది. తను పెద్ద అయ్యాక మొదట చూడాల్సిన రామాయణం అని, అందులో నేను ఉండటం చూసి చాలా సంతోషించడం మాత్రమే కాకుండా గర్వపడుతాడు అంది. నీల్ కిచ్లు గురించి మాట్లాడిన సమయంలో కాజల్ అగర్వాల్ ఎమోషనల్ అయ్యింది, తన కొడుకు గర్వించే విధంగా సినిమాలు చేయాలనే పట్టుదలతో ఉన్నట్లు పేర్కొంది.

**నితేష్ తివారీ రామాయణంలో రణ్‌బీర్ కపూర్..**

రామాయణం సినిమా విషయానికి వస్తే ఇప్పటికే షూటింగ్ దాదాపుగా పూర్తి అయిందని తెలుస్తోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న రామాయణం సినిమాపై దేశ వ్యాప్తంగా సినీ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటి వరకు రామాయణం నేపథ్యంలో పదుల సంఖ్యలో సినిమాలు వచ్చాయి. అయినా కూడా మళ్లీ రామాయణం ను కొత్తగా చూడాలనే ఆశతో ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు.

సినిమాను రెండు మూడు పార్ట్‌లుగా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఎన్ని పార్ట్‌లుగా సినిమా వస్తుంది అనేది ఇంకా క్లారిటీగా మేకర్స్ చెప్పడం లేదు. ప్రస్తుతానికి ఈ ఏడాది దీపావళికి విడుదల ఉండే అవకాశం ఉంది. రామాయణం మూవీ అన్ని భాషల్లో కలిపి, ప్రపంచ వ్యాప్తంగా రూ.5000 కోట్లు వసూళ్లు చేస్తుందని అంతా భావిస్తున్నారు. ఇండియాస్ బిగ్గెస్ట్ మూవీగా రామాయణం నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మీమీ టైమ్‌లో కృతి కీలక నిర్ణయం.. సరైన టైమ్‌లో సరైన డెసిషన్!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతిసనన్ తన పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఒక ముఖ్యమైన డెసిషన్‌ను తొలిసారిగా బహిరంగంగా వెల్లడించారు. మాతృత్వం, మహిళల ఆరోగ్యంపై జరుగుతున్న డిస్కషన్స్ మధ్య ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారి తీశాయి. కెరీర్‌లో బిజీగా ఉన్న టైమ్‌లోనే ఫ్యూచర్‌ను దృష్టిలో పెట్టుకుని ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకున్నానని ఆమె తెలిపారు. ఈ డెసిషన్ తనకు మానసిక ప్రశాంతతను ఇచ్చిందని కూడా కృతి పేర్కొన్నారు. రీసెంట్‌గా పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన కృతి, ఈ ప్రక్రియను ఎప్పుడు, ఎందుకు ఎంచుకున్నారో కూడా వివరించారు. మీమీ సినిమా కోసం ప్రత్యేకంగా బరువు పెరగాల్సి వచ్చిన టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం సరైన నిర్ణయంగా అనిపించిందని చెప్పారు. ఆ ట్రీట్‌మెంట్ వల్ల బాడీలో వచ్చే మార్పులు, సినిమాలోని క్యారెక్టర్ కోసం చేయాల్సిన శారీరక మార్పులు ఒకే టైమ్‌లో ఉండటంతో రెండింటినీ కలిపి ప్లాన్ చేసుకున్నానని వెల్లడించారు. ఎగ్ ఫ్రీజింగ్ అనేది అంత ఈజీ ప్రాసెస్ కాదని, హార్మోన్ల ప్రభావంతో శరీరంలో ఉబ్బరం, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. ఆ టైమ్‌లో శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగానూ కొన్ని ఒత్తిడులు అనుభవించానని కృతి వివరించారు. అయితే ఫ్యూచర్ గురించి ఆందోళన లేకుండా ఉండేందుకు ఈ డెసిషన్ తనకెంతో ఉపయోగపడిందని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళల జీవితంలో బయోలాజికల్ క్లాక్ అనే అంశం తరచూ ఒత్తిడికి కారణమవుతుందని, ముఖ్యంగా కెరీర్‌పై దృష్టి పెట్టే వారికి ఇది మరింత సవాలుగా మారుతుందని కృతి పేర్కొన్నారు. ఫ్యామిలీ, సమాజం నుంచి వచ్చే ప్రశ్నల కంటే, తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను మహిళలే స్వతంత్రంగా తీసుకోవాలని ఆమె సూచించారు. తాను కూడా అదే ఆలోచనతో ఈ డెసిషన్ తీసుకున్నానని చెప్పారు. మీమీ సినిమా కృతికి కెరీర్‌లో స్పెషల్ ఫిల్మ్‌గా నిలిచింది. సరోగసీ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమాలో పాత్రకు తగ్గట్టుగా శారీరకంగా ఎంతో కష్టపడిన ఆమె నటనకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కాయి. అదే సినిమాకి జాతీయ ఉత్తమ నటి అవార్డును కూడా కృతి అందుకున్నారు. ఇప్పుడదే సినిమా టైమ్‌లో తీసుకున్న మరో వ్యక్తిగత నిర్ణయాన్ని బయటపెట్టడంతో మరోసారి కృతి వార్తల్లో నిలిచారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత

**- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందేలా కృషి చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు - పార్టీ మండల అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్**





**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలం లోని కే కృష్ణాపురం, వంగర గ్రామాలకు చెందిన ఇద్దరికీ ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు అందజేసినట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తెలిపారు. కొత్త దత్త శ్రీదేవి కి 1,01,925 రూపాయలు, సోమల వేణుగోపాల్‌కు 31,483 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరైనట్లు చంద్రశేఖర్ తెలిపారు. చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు అయ్యేలా చేయించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం ద్వారా బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటుందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రాము, మాజీ సర్పంచులు కర్రీ రామ కృష్ణ, మంత్రి రామారావు, నారాయణ అప్పలనాయుడు, వంగర విశక్, కేశవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి : సబ్ పోస్ట్ మాస్టర్ అప్పల కృష్ణ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఆధార్ క్యాంప్‌లను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్ మాస్టర్ పి.అప్పలకృష్ణ కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 8, 9 తేదీలలో ప్రతిభ జూనియర్ కళాశాల వద్ద, 10, 11 తేదీలలో భవిష్య జూనియర్ కళాశాల వద్ద, 13, తేదీలలో శ్రీ కృష్ణ జూనియర్ కళాశాల వద్ద, 15, 16 తేదీలలో సాయి సిద్ధార్థ కళాశాల వద్ద ఆధార్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఆయన విలేకరులకు తెలియజేశారు. అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో ఆధార్‌కి ఫోన్ నెంబర్ లింక్, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్డేట్, పుట్టిన తేదీ మార్పు వంటి సేవలను అందజేయనున్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ పీ.అప్పలకృష్ణ సమాచారం అందజేశారు.

# ఘనంగా యువనేత బొత్స సాయి గురునాయుడు జన్మదిన వేడుకలు

**- పెద్ద సంఖ్యలో భావితరం యువ నాయకుడు సాయి గురునాయుడుకి శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ ప్రజలు - బొత్స సాయి గురునాయుడు జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన 100 మంది రక్తదాతలు - తనకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులకు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేసిన వైకాపా యువ నాయకులు బొత్స సాయిగురు నాయుడు**









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బొత్స అప్పల నరసయ్య కుమారుడు, పార్టీ యువనేత బొత్స సాయి గురునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఆనంద డోలికల నడుమ ఘనంగా జరిగాయి. ముందుగా గురు నాయుడు దావాలపేట గ్రామంలో గల మహంకాళి అమ్మ వారిని, తదుపరి గజపతినగరంలో గల శ్రీ అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్లో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన 30 కేజీల కేకును అభిమానుల కేరింతలు నడుమ బొత్స సాయి గురు నాయుడు కట్ చేయగా పార్టీ శ్రేణులు జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్చాలతో గురునాయుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 100 మంది రక్తదాతలు రక్తదానం చేయగా, రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన వైద్యులు దాతల నుంచి రక్తపూతలను సేకరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, బొత్స అనూష, బి.వి. ప్రభుజి రాజు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో-ఆర్డినేటర్ బూడి వెంకట రావు, నారాయణ మూర్తి రాజు, జడ్పిటిసిలు గార తౌడు, వర్రీ నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, ఎంపీపీలు బెల్లాన జ్ఞాన దీపిక ,చల్ల చల్లమనాయుడు, సింహాద్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, కృష్ణార్జున, వెంకటరమణ, అప్పారావు, రవికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు,మాజీ జడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, కె.పైడిపూనాయుడు, కర్రీ రామునాయుడు పాల్గొన్నారు.

# నేడు వైయస్సార్ జయంతి సందర్భంగా - పలు సేవా కార్యక్రమాలు : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఈనెల ఎనిమిదో తేదీన దివంగత నేత వై.యస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గజపతినగరం పార్టీ కార్యాలయంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంక్షేమ పథకాల సృష్టికర్త, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి, అనంతరం పార్టీ కార్యాలయంలో వైయస్సార్ విగ్రహానికి నివాళులర్పించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈ సందర్భంగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేపడతామన్నారు. ఆదివారం జరిగిన తన కుమారుడు సాయి గురు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసిన నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా బొత్స కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పిటిసి గార తౌడు, బూడి వెంకటరావు, కె. పైడపునాయుడు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, కర్రీ రామ నాయుడు, పురిటి పెంట నాయకులు గేదెల సన్యాసిరావు, లోగిస శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

**- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా - పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో, మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పి వి గోపాలరాజు, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్ లబ్ధిదారుల ఇంటి దగ్గరకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కు మొత్తం లబ్ధిదారులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనారోగ్యానికి గురై అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా సహాయం చేసి భరోసా అందించడమే ముఖ్యమంత్రి సహాయనిధి లక్ష్యమని పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి అన్నారు.

**చెక్కులు అందుకున్న లబ్ధిదారుల వివరాలు:**

ఎం.గుమడం గ్రామానికి చెందిన తామడ రమణకి - రూ. 52,553/-, పాత బగ్గాం గ్రామానికి చెందిన కోసిరెడ్డి సింహాచలంకి - రూ. 1,18,630/-, గంగుచోలపెంట (పట్రువాడ) గ్రామానికి చెందిన వాసిరెడ్డి జయలక్ష్మికి-రూ. 1,30,447/-, పురిటిపెంట గ్రామానికి చెందిన మద్దిల స్వామినాయుడుకి - రూ. 92,226/-, గజపతినగరం గ్రామానికి చెందిన కోళ్ల అప్పల జగదీశ్వరి గుప్తాకి - రూ. 66,199/-, జిన్నాం గ్రామానికి చెందిన ఇజ్జురోతు నరసింహుడుకి-రూ. 48,795/-, వేమలి గ్రామానికి చెందిన బైరెడ్డి అప్పలనరసమ్మకి-రూ. 39,336/-, రాష్ట్ర మంత్రి వర్యులు కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో గజపతినగరం మండలానికి, నియోజకవర్గానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడం ఆనందదాయకమని పార్టీ నాయకులు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు లెంక బంగారునాయుడు, పిఎసిఎస్ డైరెక్టర్ సీరం రెడ్డి రామ్ కుమార్, ఆంధ్ర రిజర్వాయర్ చైర్మన్ కోడి సతీష్, గజపతినగరం మండల టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి లెంక చిన్నం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వైకుంఠం ప్రదీప్, డాకి నారాయణప్పాడు, జి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సానుకూలత పెంచండి-అర్జీదారునితో మాట్లాడండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజా సానుకూలతను పెంచాలని, అదేవిధంగా ప్రజల సంతృప్త స్థాయిని మెరుగుపర్చేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఐవిఆర్ఎస్ కాల్స్, ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజా సానుకూలత, సర్ తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్త స్థాయిని పెంచేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అలాగే పీజేఆర్ఎస్‌పై సమీక్షిస్తూ, ఫిర్యాదుదారునితో తప్పనిసరిగా మాట్లాడాలని, దానివల్ల చాలా వరకు అర్జీలను పరిష్కరించేందుకు, సమస్యను పూర్తిగా అర్థం చేసుకొనేందుకు అవకాశం లభిస్తుందని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పిజిఆర్ఎస్ ధరఖాస్తులను మూసివేసిన మూడు శాఖలకు చెందిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుని సంతృప్తే లక్ష్యమని పేర్కొన్నారు. తమ శాఖకు సంబంధంలేని ధరఖాస్తు తమకు వచ్చినపక్షంలో, దానిని సంబంధిత శాఖకు పంపించాలే తప్ప, దానిని మూసివేయకూడదని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ ధరఖాస్తులకు సంబంధించి ఎట్టి పరిస్థితిలోనూ నిర్ణీత గడువు దాటకూడదని చెప్పారు. ఐవిఆర్ఎస్ సర్వేలో అంతగా సానుకూలత వ్యక్తం కాని ప్రభుత్వ శాఖలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించి, సానుకూలతను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సర్‌లో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డి.ఆర్.ఓ సి.హెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఆన్‌లైన్ ద్వారా ఆర్‌డిఓలు, తాహసీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

## - భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్‌లతో కలసి సమీక్ష








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి ఆదేశించారు. జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 (ఎస్ఐఆర్) అమలు తీరుపై సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్‌లతో కలసి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి డిఇఓ, ఈఆర్ఓలు మరియు ఏఈఆర్ఓలు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర కార్యక్రమాలను నిర్దేశిత కాలపట్టిక ప్రకారం పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఫారాల సేకరణలో ఇతరులు సహాయం చేసినప్పటికీ, అసలైన ఓటర్ల వివరాల పరిశీలన మరియు తుది నమోదు ప్రక్రియను బూత్ లెవెల్ అధికారులు స్వయంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేదా ఇతర అనధికారిక వ్యక్తులు ఓటర్ల వివరాల నమోదు, పరిశీలన వంటి ప్రధాన విధుల్లో జోక్యం చేసుకోకూడదని, అన్ని పనులను బీఎల్వోలే స్వయంగా చేయాలని, క్షేత్రస్థాయిలో సరైన ఓటరు వివరాలను స్వయంగా సరిచూసుకోవాలని స్పష్టం చేసారు. ఒకవేళ దరఖాస్తుదారుడి తండ్రి లేదా తాత వివరాలు లభ్యం కాకపోతే, సదరు వ్యక్తి డేటా ఎంట్రీని దరఖాస్తుదారుడి సమక్షంలో, వారి అంగీకారంతోనే పూర్తి చేయాలన్నారు. ప్రతి కేసును క్షుణ్ణంగా వెరిఫై మరియు రీ–వెరిఫై చేసిన తర్వాతే, అర్హతను బట్టి ఈఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) తుది నిర్ణయం తీసుకుని, జెన్యూన్ ఓటర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శికి జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి వివరిస్తూ... కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తి బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని, నిర్దేశిత గడువులోగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. మండల స్థాయి కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, సూపర్‌వైజర్ల ద్వారా నిరంతర నిఘా, రోజువారీ లక్ష్యాల నిర్దేశం, వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక వ్యూహం, మండలాల మధ్య ఉత్సాహభరిత పోటీ – పరస్పర సహకారం మరియు ఏఈఆర్ఓలు ప్రతి రోజూ బీఎల్ఓలకు నిర్దిష్ట డిజిటలైజేషన్ శాతాన్ని లక్ష్యంగా విధిస్తున్నారని, వారికి కేటాయించిన లక్ష్యంలో ఎంతవరకు పని పూర్తయింది, ఇంకా ఎన్ని ఫారాలు డిజిటలైజ్ చేయాల్సి ఉందనే వివరాలను సేకరించి రోజువారీ ప్రగతిని నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పద్ధతి వల్ల పనుల వేగం గణనీయంగా పెరిగిందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శికి జిల్లా రెవెన్యూ అధికారి వివరిస్తూ... జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 6 మంది ఈఆర్ఓలను, 29 మంది ఏఈఆర్ఓలను, 9 మంది ఎడిషనల్ ఏఈఆర్ఓలను,160 మంది సూపర్వైజర్ లను, 1529 మంది బిఎల్ వోలను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 13,02,389 ఉండగా, ఇప్పటివరకు 11,64,089 మందిని మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 1529 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని, అదనంగా 107 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయుటకు, 6 పోలింగ్ స్టేషన్లను స్థాన మార్పు కోసం, 55 పోలింగ్ స్టేషన్లను పేరు మార్పు కోసం ప్రతిపాదించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి వై శ్రీనివాసరావు, ఓటర్ల నమోదు అధికారులు ఈఆర్ఓలు, మరియు సహాయ ఓటర్ల నమోదు అధికారులు ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

# అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి గవర పాలెంలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారిని సోమవారం ఉదయం భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆయనకు దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్ ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ఆర్డీవో అయేషా, జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పైడ్రాజు,యర్రవరపు సంతోషి కుమారి, నాగేష్ పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కంట్రోల్ రూమ్ సీఐ రమణయ్య



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన బండి రమణయ్య సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ వారికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2009 బ్యాచ్‌కు చెందిన రమణయ్య ఇప్పటి వరకు అనకాపల్లి కోర్టు మానిటరింగ్ సెల్ ఎస్సైగా విధులు నిర్వహించారు. ఇటీవల ఆయన పదోన్నతి పొంది, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ నూతన సీఐ రమణయ్యకి అభినందనలు తెలియజేస్తూ పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు, పోలీసులకు అనుసంధానంగా పోలీస్ కంట్రోల్ రూమ్ అనేది ప్రజలకు, పోలీస్ శాఖకు మధ్య అత్యంత కీలకమైన వారధిగా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర కాల్స్‌పై కంట్రోల్ రూమ్ సిబ్బంది తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలోని పోలీసులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు కంట్రోల్ రూమ్ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన సీఐ రమణయ్య మాట్లాడుతూ ఎస్పీ వారి ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.

# గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ : డీజీపీ సీవీ ఆనంద్



**మణుగూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి పెంచే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్ర తలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

# విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు పంపిణీ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు

## - తాను పనిచేసిన నాలుగు పాఠశాలలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన అర్జునరావు మాస్టారు





**అల్లవరం, (రాజధాని వార్తలు):** తాను ఉపాధ్యాయునిగా పనిచేసిన పాఠశాలలలోని విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు నోట్స్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అల్లవరం మండలం ఓడలరేవుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోలా అర్జునరావు మాస్టారు తాను సర్వీస్‌లో ఉండగా పనిచేసిన నాలుగు పాఠశాలలలో విద్యార్థులకు తన వంతు సహాయంగా సోమవారం నోట్స్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయునిగా నెల నెల జీతం తీసుకున్నానని అయితే ఎంతో కొంత విద్యార్థులకు ఇవ్వాలని ఆలోచనతో పదవీ విరమణ అనంతరం రూ. 50 వేల రూపాయలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ మొత్తం నుండి వచ్చిన వడ్డీతో ప్రతి ఏటా విద్యార్థు లకు నోట్స్ పుస్తకాలు పెన్నులు అందజేస్తున్నారు. తాను పనిచేసిన ఓడలరేవులోని మూడు ప్రాథమిక పాఠశాలలు, బెండమూర్లంకలోని ఒక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన వంతుగా సహాయం చేయాలని ఆ నగదును డిపాజిట్ చేశానని అర్జునరావు మాస్టర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అర్జునరావు మాస్టారు చేసిన మంచి పని ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని ఉపాధ్యాయుడు పాల వెంకటేశ్వరరావు మాస్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పినపోత రామకృష్ణ, కలిగితి సత్యనారాయణ, తారాడి ఉమామహేశ్వరరావు, అవనిగడ్డ సత్తిరాజు, మల్లాడి భాస్కరరావు, గుబ్బల శ్రీనివాసరావు, పెచ్చెట్టి రామకృష్ణ, తోటే శివరావు పొన్నమడ ఏసుబాబు, అవనిగడ్డ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# 7 రోజుల్లో న్యాయం జరగాలి... పోలీసు అధికారులకు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** బాధితుల ముఖంలో నవ్వే పోలీసు వ్యవస్థకు అసలైన కొలమానమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి బాధితులు తరలి వచ్చారు. ఎస్పీ వారు స్వయంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వేదికలో మొత్తం 38 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన 38 ఫిర్యాదులలో ఎక్కువగా ఈ క్రింది సమస్యలపైనే ప్రజలు ఆశ్రయించారు. సివిల్ వివాదాలు భూ తగాదాలు, ఆస్తి గొడవలు, ఆర్థిక మోసాలు, కుటుంబ సమస్యలు భార్యాభర్తల వేధింపులు, గృహ కలహాలు, ఇతరాలు శాంతిభద్రతలు మరియు పౌర సమస్యలు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, అక్కడికక్కడే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై గరిష్టంగా వారం రోజుల్లోపు విచారణ పూర్తి చేసి బాధితుడికి న్యాయం చేయాలి. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, కేవలం నిజాల ఆధారంగా పారదర్శకంగా దర్యాప్తు జరగాలి. స్టేషన్‌లో కేసు ఏ దశలో ఉందో బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో నమ్మకం నింపాలి. విచారణ ముగిసిన వెంటనే తీసుకున్న చర్యలపై పూర్తి నివేదికను జిల్లా కార్యాలయానికి పంపాలి."ముఖ్యంగా మహిళల రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు. మహిళలను, సామాన్యులను మోసగించే వారిపై చట్టపరంగా ఉక్కుపాదం మోపుతాం. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చు. మీకు అండగా నిలవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్సానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కుట్ర కుట్ర కుట్ర మైనార్టీ ఆస్తులపై అధికారుల కుట్ర


**- మైనార్టీ భూములు భారీ స్థాయిలో నాశనం చేయడానికి పక్కా ప్లాన్‌తో కుట్రలు చేస్తున్న అధికారులే - అల్తాఫ్ రజా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు**



**(రాజధాని వార్తలు):** కొండపల్లి మున్సిపాలిటీలో వక్ఫ్ బోర్డు భూములలో మున్సిపాలిటీ నిధులతో ఆక్రమణదారులకు సహకరించే విధంగా రోడ్లు, డ్రైనేజీలు,అభివృద్ధి కార్యక్రమాలు వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా అధికారులు ఎలా చేస్తారని ప్రశ్నించారు ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ రజా. మైనార్టీ ఆస్తులపై అధికారుల కుట్ర కాదా అన్నారు. వక్ఫ్ బోర్డు భూములలో పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మాణం జరుగుతుంటే, ఆయా భవనాలకు ప్లాన్ అప్రూవల్‌లు నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్ ఆస్తులలో ఎలా చేస్తున్నారో చెప్పాలన్నారు. వక్ఫ్ బోర్డ్ భూములలో ఆక్రమణదారుల పేర్లతో పన్నులు ఎలా వేస్తారని, కనీస అవగాహన లేకుండా ఉద్యోగాలు చేస్తున్నారా అని మండిపడ్డారు. కొండపల్లి శాంతినగర్ 212 ఏ, 212 బి,18 ఎకరాల 30 సెంట్లలో ఆక్రమణదారులకు మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో అండదండలు, ఇబ్రహీంపట్నం ఖాజీ మాన్యం 244 సర్వే నంబర్, కొండపల్లిలో 438/1, 289/3 293/1,401 సర్వే నెంబర్‌లలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమైనటువంటి చర్య అన్నారు. వక్ఫ్ బోర్డ్ సంస్థకు సంబంధించిన భూములలో భారీ స్థాయిలో వందల భవనాలు నిర్మాణం జరుగుతుంది అధికారులు ఎందుకు చూస్తున్నారు అన్నారు. మున్సిపాలిటీ నిధులతో మౌలిక సదుపాయాలు దుర్మార్గమన్నారు. వక్ఫ్ బోర్డ్ భూములలో అధికారులు టెండర్లు ఎలా పిలుస్తారనని అవినీతి జరగకుండానే కాంట్రాక్టు బిల్లులు అవుతున్నాయా? రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు ఆక్రమణదారులకు సహకరించిన ఎఈ, ఏడి, ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు, కమిషనర్లు వక్ఫ్ బోర్డ్ భూములలో మౌలిక సదుపాయాల పేరుతో అనుమతులు ఇచ్చిన సంతకం పెట్టిన ప్రతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు భూమిపై తీర్మానాలు ఎలా చేశారు. అన్నిటిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతమైన గౌరవ న్యాయస్థానం హైకోర్టు, సుప్రీంకోర్టు అయినా సరే వక్ఫ్ భూములు అన్యాక్రాంతానికి సహకరించిన ప్రతి అధికారి కోర్టు మెట్లు ఎక్కాల్సిందే న్యాయం కోసం న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఒక కొండపల్లి మున్సిపాలిటీలోనే వక్ఫ్ భూములలో వందల భవనాలు మౌలిక సదుపాయాల పేరుతో కోట్ల రూపాయల రోడ్లు డ్రైనేజీలు అంటూ ఇంత అరాచకం జరిగిందంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏమిటి..వక్ఫ్ భూములలో ఆక్రమణదారులకు సహకరించాలని చిత్తశుద్ధి ఎవరికైనా ఉంటే రాష్ట్ర వక్ఫ్ బోర్డు దృష్టికి తీసుకెళ్లి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గర సమస్యను తీసుకెళ్లి మైనార్టీ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అల్తాఫ్ బాబా తెలిపారు.

# హజ్ యాత్రికుల పాస్‌పోర్ట్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- విజయవాడ పాస్‌పోర్ట్ అధికారికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా విజ్ఞప్తి**



**విజయవాడ, (రాజధాని వార్తలు):** 2027 పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా కోరారు. ఆయన విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడి ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. సెంట్రల్ హజ్ కమిటీ 2027 హజ్ యాత్రకు సంబంధించిన అప్లికేషన్ల గడువు ముగిసేలోపు, యాత్రకు వెళ్లాలనుకునే ప్రతి ఒక్కరికీ పాస్‌పోర్ట్‌లు అందేలా చూడాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను అభ్యర్థించారు. హజ్ యాత్రికులకు సంబంధించిన కొత్త పాస్‌పోర్ట్ దరఖాస్తులను, అలాగే పాత పాస్‌పోర్ట్‌ల రెన్యూవల్స్‌ను ప్రాధాన్యత క్రమంలో తీసుకొని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా క్లియర్ చేయవలసిందిగా పాస్‌పోర్ట్ ఆఫీసర్‌కు విజ్ఞప్తి చేశారు.

**పాస్‌పోర్ట్ సేవా కేంద్రం సేవలపై ప్రశంసలు:**

ఈ సందర్భంగా హజ్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు, ముఖ్యంగా హజ్ యాత్రికులకు పాస్‌పోర్ట్ కార్యాలయ సిబ్బంది అందిస్తున్న సహకారం మరియు వారి పనితీరు అత్యంత పారదర్శకంగా, వేగంగా ఉందన్నారు. అదే ఉత్సాహంతో రాబోయే హజ్ యాత్ర దరఖాస్తుదారులకు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు.

**ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న గౌరవ ముఖ్యమంత్రికి, అలాగే యువ నాయకులు, ఐటీ & మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కి హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల పవిత్ర హజ్ యాత్రకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హజ్ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నాణ్యతతో పూర్తి చేయాలి

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ – 2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌లతో కలసి మునగపాక గ్రామం, సచివాలయం – 2 పరిధిలోగల పోలింగ్ స్టేషన్ నెంబర్ 165 సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి ఎస్.బి.జోషి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలు, వాటి పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియ, నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి దశను జాగ్రత్తగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆయేషా, ఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు : పవన్ కల్యాణ్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. మంగళవారం అంబేడ్కర్ కళావేదికలో ఏపీ హస్తకళా మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొని మాట్లాడారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారులు వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan